సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 4 । నవంబర్ । 2024

వలిసె సొగసు చూడతరమా!



మన్యం సందర్శనకు వచ్చే పర్యాటకులకు వలిసె పూల అందాలు స్వాగతం పలుకుతున్నాయి. పాడేరు నుంచి పెదబయలు వెళ్లే మార్గంతోపాటు పెదబయలు సమీపంలోని ఆంధ్రా–ఒడిశా సరిహద్దు వంతెన పరిసరాల్లో పసుపు పచ్చని తివాచీ మాదిరిగా కనువిందు చేస్తూ ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి,పాడేరు/పెదబయలు

న్యూస్‌రీల్

నేడు గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి పర్యటన

సాక్షి,పాడేరు: గిరిజన, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సోమవారం పాడేరులో పర్యటించనున్నారని కలెక్టర్ కార్యాలయం ఆదివారం ప్రకటన విడుదల చేసింది. బంగారుమెట్టలో దీపం 2.0 పంపిణీ, సుండ్రుపుట్టులో మిషన్ పాట్ హోల్ ఫ్రీ, కుమ్మరిపుట్టు ఆశ్రమ పాఠశాలలో కిశోర్ వికాసం కార్యక్రమాల్లో ఆమె పాల్గొంటారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో మంత్రి సమీక్షిస్తారు. అనంతరం విశాఖపట్నం వెళ్తారని తెలిపింది.

పింఛన్ల పంపిణీలో రాష్ట్ర స్థాయిలో జిల్లా ప్రథమ స్థానం

- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: పింఛన్ల పంపిణీలో రాష్ట్ర స్థాయిలో జిల్లా ప్రథమ స్థానం సాధించిందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌తో పాటు ప్రస్తుత నెలలో కూడా పింఛన్ల పంపిణీలో మొదటి స్థానం సాధించిందన్నారు. రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు జిల్లా హ్యాట్రిక్ సాధించిందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో 1,24,354 మంది సామాజిక పింఛన్లు ఉండగా 1,23,706 మందికి (99.48 శాతం) పంపిణీ చేసినట్టు ఆయన వెల్లడించారు. ఇలా విజయవంతానికి కృషి చేసిన డీఆర్‌డీఏ పీడీ మురళి, ఇతర అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

పోలీసుస్టేషన్లను సందర్శించిన డీఎస్పీ

రాజవొమ్మంగి: స్థానిక పోలీసుస్టేషన్‌తోపాటు మండలంలోని జడ్డంగి పోలీస్‌స్టేషన్‌ను రంపచోడవరం డీఎస్పీ సాయి ప్రశాంత్ శనివారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. గంజాయి నిర్మూలనకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు ప్రజల నుంచి కూడా సహకారం అవసరమన్నారు. ఆయన వెంట సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐలు నర్సింహమూర్తి, చిన్నబాబు ఉన్నారు.

తప్పని డోలీ మోతలు

- అస్వస్థతకు గురైన మహిళ రాత్రివేళ తరలింపు



జర్తా కాసులమ్మను డోలీలో మోసుకు వెళ్తున్న గిరిజనులు

గూడెంకొత్తవీధి: జిల్లాలో గిరిజనులకు డోలీ మోతలు తప్పడం లేదు. మండలంలోని గాలికొండ పంచాయతీ బూసికొండ గ్రామానికి చెందిన జర్తా కాసులమ్మ అనారోగ్యంతో శనివారం రాత్రి అస్వస్థతకు గురైంది. జ్వరం, వాంతులు, తీవ్రమైన కడుపునొప్పి రావడంతో ఆమె భర్త శంకర్రావు గ్రామస్తులు, కుటుంబ సభ్యుల సహకారంతో ఆమెను డోలీలో సుమారు 8కిలోమీటర్ల మోసుకుని కొండలు దాటించి జంపర్లోవ రోడ్డు మార్గానికి తీసుకువచ్చారు. అక్కడి నుంచి ఆటోలో ఆస్పత్రికి తరలించారు. ఇటీవల తుపాను ప్రభావం వల్ల కొండచరియలు, చెట్లు, పెద్ద బండరాళ్లు విరిగిపడటంతో ఉపాధి పథకంలో నిర్మించిన మట్టిరోడ్డు దెబ్బతింది. దీంతో వాహనాలు రాలేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి గాలికొండ, అమ్మవారి దారకొండ తదితర మారుమూల ప్రాంతాలకు రహదారులు నిర్మించాలని ఎంపీటీసీ బుజ్జిబాబు కోరారు.

గిరిజన మ్యూజియానికి రూ.1.52 లక్షల ఆదాయం



పద్మాపురం ఉద్యానవనంలో సందర్శకులు

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రాలైన గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్‌కు పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆదివారం గిరిజన మ్యూజియంను 1530 మంది పెద్దలు, 290 మంది చిన్నారులు సందర్శించారు. ప్రవేశరుసుం ద్వారా రూ.1.52 లక్షల ఆదాయం సమకూరింది. పద్మాపురం గార్డెన్‌ను 1330 మంది సందర్శించగా ప్రవేశరుసుం ద్వారా 77,300 ఆదాయం వచ్చిందని సిబ్బంది తెలిపారు. మాడగడ సన్ రైజ్ వ్యూపాయింట్‌కు భారీగా సందర్శకులు తరలివచ్చారు.



మత్స్యగుండంలో మత్స్యలింగేశ్వరుని ఆలయం



చింతపల్లి: అంతర్లలో అనాధీశ్వర స్వామి ఆలయం




రంపచోడవరం: రంపలో పురాతన శివాలయం



చింతపల్లి: బౌడ గ్రామంలో ముస్తాబైన శివాలయం

ఆధ్యాత్మిక వన విహారం

జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలు ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా ప్రసిద్ధి చెందాయి. ఎటుచూసినా దట్టమైన అటవీప్రాంతం.. జలపాతాల సవ్వడి.. పక్షుల కిలకిలారావాలు..ఇలా ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్నందున కార్తీకమాసంలో సందర్శనకు భక్తులు భారీగా తరలివస్తుంటారు. కుటుంబ సమేతంగా ఆలయాలను సందర్శిస్తారు. కార్తీక వనసమారాధనలు నిర్వహిస్తూ ఉత్సాహంగా గడుపుతారు.




మత్స్యగుండంలో మత్స్యలింగేశ్వరస్వామి

- ఆహ్లాదకర వాతావరణంలో శైవ క్షేత్రాలు
- ఒక వైపు దర్శనం.. మరోవైపు వన సమారాధనలు
- కార్తీకమాసంలో రోజూ సందడే



కార్తీక పూజలకు ముస్తాబైన గురమంద విశ్వనాథుడు



రంపలో పూజలందుకుంటున్న శివలింగం

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని మత్స్యగుండం పవిత్ర పుణ్యక్షేత్రంగా నాలుగు రాష్ట్రాల భక్తులు విశ్వసిస్తున్నారు. పాడేరుకు 13 కిలోమీటర్ల దూరంలో హుకుంపేట మండలం మఠం పంచాయతీ పరిధిలో ఈ ఆలయం ఉంది. ఇక్కడ మత్స్యగెడ్డ సెలయేరులోని మత్స్యగుండంలో మత్స్యాలను దేవతలుగా భక్తులు పూజిస్తారు. మత్స్యలింగేశ్వరస్వామిని, పుట్టలోని నాగదేవతలను దర్శించుకుంటారు. వీటిని దర్శించుకునేందుకు కార్తీక మాసంలో తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి భారీగా తరలివస్తారు. ఈ ఆలయానికి వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయి. సాయంత్రం సహస్ర దీపార్చన నిర్వహిస్తారు. కార్తీకమాసం నెలరోజు వనసమారాధనలు నిర్వహిస్తారు. తారు రోడ్డు సౌకర్యం ఉన్నందున బైక్‌లు, ఆటోలు, కార్లు తదితర వాహనాల్లో అక్కడికి చేరుకోవచ్చు.

దేవతలు ప్రతిష్ఠించిన శివలింగాలు

వై.రామవరం: పూతిగుంట పరమేశ్వరుడు, గురమంద విశ్వనాథుడు ఆలయాలకు చరిత్ర ప్రాధాన్యముంది. ఈ రెండుచోట్ల శివలింగాలను దేవతలు ప్రతిష్ఠించినట్టుగా స్థానికులు చెబుతుంటారు.

- గురమంద విశ్వనాథుని ఆలయంలో శివలింగం పడగ ఆకారంలో ఉన్న కొండ దిగువ భాగాన ఉంటుంది. మండల కేంద్రం నుంచి కిలోమీటరు దూరంలోఉన్న యార్లగడ్డ గ్రామానికి చేరుకోవాలి. అక్కడి నుంచి నాలుగు కిలోమీటర్లు కాలినడకన, బైక్‌లపై అటవీమార్గంలో వెళ్లాలి.
- పూతిగుంట పరమేశ్వరుడు ఆలయానికి మండల కేంద్రం నుంచి 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న చౌడు దిబ్బలు చేరుకోవాలి. అక్కడి నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో ఉన్న పూతిగుంట గ్రామానికి వెళ్లాయి. ఆలయాన్ని ఆనుకుని ఉన్న బండరాళ్లపై నుంచి జాలువారే ప్రవాహంలో భక్తులు పుణ్యస్నానాలు చేస్తుంటారు. ఇక్కడ నెలరోజులపాటు అన్నసమారాధనలు నిర్వహిస్తారు.

స్వయంభూ.. జడ్డంగి మల్లికార్జునుడు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి అటవీప్రాంతంలో దాదాపు 150 సంవత్సరాల క్రితం స్వయంభూగా వెలసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి విశేష పూజలందుకుంటున్నాడు. జమదగ్ని అనే మహర్షి గుహలోని శివలింగం వద్ద మహా తపస్సు చేసినట్లు చరిత్ర చెబుతోంది. జమదగ్ని సంచరించిన ప్రాంతం కావడం వల్లనే ఈ గ్రామానికి జడ్డంగి అనే పేరు వచ్చిందంటారు. ఈ శివుడిని దర్శించుకునేందుకు మోకాళ్లపై పాకుతూ లోపలకు వెళ్లాలి. ఈ ఆలయాన్ని ఆనుకుని జీవనది మదేరు నిత్యం ప్రవహిస్తూ ఉంటుంది. దట్టమైన అటవీ ప్రాంతంలో బండరాళ్ల మధ్య గల ఈ ఆలయానికి ఎస్ఆర్సీ అనే సంస్థ ఇటీవల తాళ్ల వంతెన నిర్మించింది.



పూతిగుంట పరమేశ్వరుడి ఆలయంలో పూజలు



జడ్డంగిలో భ్రమరాంబిక మల్లికార్జున స్వామి


పురాతన శైవక్షేత్రాలుగా..

చింతపల్లి: అంతర్ల శివాలయం, అనాధీశ్వర ఆలయం, లోతుగెడ్డలోని వీరభద్రస్వామి ఆలయాలు పురాతన పురాతనమైనవిగా గుర్తింపు పొందాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న ఈ ఆలయాలను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుంటారు.

సర్వదోషాలు హరించే దివ్యక్షేత్రం

రంపచోడవరం : ఇక్కడికి సమీపంలోని రంప శివాలయంలో శ్రీశ్రీశ్రీ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుంటే సర్వదోషాలు హరించి మంచి చేకూరుతుందని భక్తుల విశ్వాసం. కార్తీక మాసంలో విశేష సంఖ్యలో భక్తులు విచ్చేస్తారు.

కలెక్టర్ ఆటవిడుపు



జలపాతంలో కలెక్టర్ దినేష్‌కుమార్

జి.మాడుగుల: నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉండే కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదివారం కుటుంబ సభ్యులతో కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించారు. బండరాళ్లపై నుంచి జాలువారుతున్న నీటి ప్రవాహంలో జలకాలాడుతూ సందడి చేశారు. జలపాతం దిగువన ఉన్న ఆహ్లాదకరమైన ప్రదేశాలను పరిశీలించారు. నిర్వాహకుల నుంచి వాటి వివరాలు తెలుసుకున్నారు.



పిల్లలతో సందడి చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

గిరి గ్రామాలపై చలి పంజా



ముంచంగిపుట్టులో దట్టంగా కురుస్తున్న మంచు

ముంచంగిపుట్టు: మండలంలో రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. గిరిజన గ్రామాలపై చలి పంజా విసురుతోంది. మంచు దట్టంగా కురుస్తుండడంతో రోజువారి పనులకు వెళ్లేవారు గజగజ వణికిపోతున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు చలితీవ్రత ఎక్కువగా ఉంటోంది.

వేడుకగా ఆరోగ్య దీపావళి



సుజనకోటలో చిన్నారులకు పూజలు చేస్తున్న గిరిజనులు



దార్రెలలో చిన్నారులను స్నానం చేయించేందుకు బిందెలతో సిద్ధం చేసిన నీరు

- సుజనకోట, దార్రెల, కించాయిపుట్టు గ్రామాల్లో ఘనంగా నిర్వహణ
- చిన్నారులకు దోష నివారణ పూజలు

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట, దార్రెల, కించాయిపుట్టు గ్రామాల్లో అనురాధ నక్షత్రం రోజైన ఆదివారం దీపావళి పండగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా గిరిజనుల ఆనవాయితీ ప్రకారం పంచెకట్టు పండగ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 8నుంచి 10 సంవత్సరాల చిన్నారులను గ్రామ చావిడి వద్దకు తీసుకువచ్చి పంచెకట్టి, మామిడి తోరణాలను కిరీటాలుగా అలంకరించారు. బిందెలతో తీసుకువచ్చిన నీటిలో పసుపు,చేదు ఆనపకాయను కలిపి పువ్వులు,అక్షింతాలతో ప్రత్యేక పూజలు చేశారు. గునపాల మీద చిన్నారులను కూర్చొబెట్టి హారతి ఇచ్చారు. అనంతరం నీటితో స్నానాలు చేయించారు. అనంతరం ఆ నీటిని చల్లుకున్నారు. చిన్నారులకు తెల్లటి వస్త్రాలను ధరింపజేశారు. ఈ పంచెకట్టు వేడుకను చూసేందుకు పరిసరాల గ్రామాల గిరిజనులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. చిన్నారులకు దోషాల నివారణ, మంచి జరుగుతుందన్న నమ్మకంతో పంచెకట్టు పండుగను నిర్వహిస్తున్నామని ఆయా గ్రామాల గిరిజనులు తెలిపారు. అనంతరం గ్రామాల్లో అందరూ సహపంక్తి భోజనాలు చేశారు. థింసా నృత్యాలతో సందడి చేశారు. అదేరోజు రాత్రి బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు శంకర్‌రావు, నాగేశ్వరరావు, బాలమురళి, నీలకంఠం, సదానందం, గణపతి,మన్మథరావు, ఈశ్వర్‌రావు,మత్స్యరాజు, లోహితాష్, తిరుపతిరావు,ఆనందరావు,చందర్‌రావు పాల్గొన్నారు.

జనావాసంలో మద్యం దుకాణం వద్దు

- రాజవొమ్మంగిలో విద్యానగర్ మహిళల నిరసన
- అధికారుల హామీతో ఆందోళన విరమణ



మద్యం దుకాణాన్ని వ్యతిరేకిస్తూ రోడ్డుకు అడ్డంగా ఆందోళనకు దిగిన విద్యానగర్ మహిళలు

రాజవొమ్మంగి: జనావాసాల మధ్య మద్యం దుకాణం వద్దంటూ మండల కేంద్రం రాజవొమ్మంగిలో విద్యానగర్‌కు చెందిన మహిళలు ఆదివారం ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రమైన రాజవొమ్మంగిలో రెండు మద్యం దుకాణాలు మంజూరయ్యాయి. అవి జాతీయరహదారి పక్కన, సినిమా థియేటర్ వద్ద నడుస్తున్నాయి. మరో నాలుగు రోజుల్లో వీటిని వేరే ప్రాంతానికి తరలించాల్సి ఉంది.దీంతో షాపు యజమానులు విద్యానగర్‌లోని ఓ శ్లాబ్ ఇంటిలో మద్యం దుకాణం తెరిచేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పరిసర ప్రాంత మహిళలు నివాసిత ప్రాంతంలో ఏర్పాటును వ్యతిరేకిస్తూ శనివారం ఎక్సైజ్, ఎస్ఐలను సంప్రదించారు. ఈ ప్రాంతంలో మద్యం దుకాణం వద్దని మొరపెట్టుకున్నారు. వారినుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఆదివారం ఆందోళనను ఉధృతం చేశారు. రహదారికి అడ్డంగి దుంగలు పేర్చారు. జనావాసంలో మద్యం దుకాణం తగదని స్పష్టం చేశారు. దీంతో సర్పంచ్ సోదరుడు గొల్లపూడి పెద్దరాజు, ఎస్ఐ నర్సింహమూర్తి వారి వద్దకు చేరుకున్నారు. మద్యం దుకాణం ఏర్పాటుచేయమని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. దీనిపై ఎక్సైజ్ సీఐ శ్రీధర్‌ను వివరణ కోరగా విద్యానగర్‌లో దుకాణం ఏర్పాటు చేయవద్దని మద్యం దుకాణ లైసెన్సు దారులకు సూచించామన్నారు.

గిరిజనాభివృద్ధిపై కూటమి వివక్ష

- ప్రత్యేక నిధులు కేటాయించని రాష్ట్ర ప్రభుత్వం
- జాతీయ ఉపాధి హామీ నిధులను అడ్డుకోవడం అన్యాయం
- తప్పనిసరిగా సమాధానం చెప్పాల్సిందే
- అరకు ఎంపీ, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ డిమాండ్
- తీరు మారకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరిక



సమావేశంలో అరకు ఎంపీ తనూజారాణి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరాజు, మత్స్యలింగం

సాక్షి,పాడేరు: జిల్లా అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం వివక్ష అన్యాయమని, ఇప్పటికైనా ప్రత్యేక నిధులు కేటాయించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకు ఎంపీ తనూజారాణి, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర డిమాండ్ చేశారు. ఆదివారం విశ్వేశ్వరరాజు అధ్యక్షతన పాడేరులోని ఆయన నివాసంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో వారితోపాటు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ పాల్గొన్నారు. జిల్లాలోని సమస్యలపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అభివృద్ధిపై వివక్ష చూపుతోందని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను కూడా అడ్డుకోవడం అన్యాయమన్నారు. గిరిజనాభివృద్ధి కూటమి ప్రభుత్వానికి ఇష్టం లేనట్టుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నిధుల కేటాయింపులో చూపుతున్న నిర్లక్ష్యానికి సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇద్దరు ఎమ్మెల్యేలు, ఎంపీ వైఎస్సార్‌సీపీ నుంచి విజయం సాధించారని, జిల్లాలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు అధికంగా ఉన్నారనే నెపంతో కక్షపూరితంగా నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. తక్షణమే రోడ్లు, వంతెనలు, తాగునీరు, మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని గిరిజనుల అభివృద్ధి అజెండాగా నిధులు కేటాయించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.



చింతపల్లి: చెరువుల వేనం వ్యూపాయింట్ వద్ద పర్యాటకుల సందడి



అరకులోయ టౌన్: మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ వద్ద పర్యాటకులు



సందర్శకులతో కిటకిటలాడుతున్న కొత్తపల్లి జలపాతం

మురిసిన పర్యాటకం

భారీగా తరలివచ్చిన సందర్శకులు

సాక్షి,పాడేరు/ముంచంగిపుట్టు/చింతపల్లి/డుంబ్రిగుడ/జి.మాడుగుల/అరకులోయ టౌన్: జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కళకళలాడాయి. ఆదివారం భారీగా తరలిరావడంతో సందడి నెలకొంది. వంజంగిలో మేఘాల కొండను, ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో డుడుమ జలపాతాన్ని, లంబసింగిలో చెరువుల వేనంలో ప్రకృతి అందాలు తిలకించేందుకు పోటెత్తారు. తాజంగి జలాశయానికి భారీగా తరలివచ్చారు. చాపరాయి జలవిహారి, అంజోడ సిల్క్‌ఫారంలోని అరకు పైనరీలో సందడి చేశారు. పొద్దుతిరుగుడు తోటల్లో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. కొత్తపల్లి జలపాతానికి భారీగా సందర్శకులు తరలివచ్చారు.



పాడేరు మండలం వంజంగి హిల్స్‌లో ప్రకృతి అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు



అరకు పైనరీ ముఖద్వారం వద్ద పర్యాటకులు



చాపరాయి జలవిహారి సందర్శనకు తరలివచ్చిన పర్యాటకులు

క్లుప్తంగా

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో ప్రిన్సిపాల్ చిట్టిబ్బాయి తదితరులు

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టిబ్బాయి ఆదివారం ఆవిష్కరించారు.పాడేరుకు చెందిన జంగమ సేవాసంఘం అధ్యక్షుడు శివరాత్రి శ్రీనివాసరావు దీనిని సమకూర్చారు. ఈ సందర్భంగా ఆయనను ప్రిన్సిపాల్, అధ్యాపకులు సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ రసూల్, మణికంఠ అన్నదాన ట్రస్ట్ సభ్యులు కొండలరావు, ముకుంద, దేవుడు,బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

7న నర్సీపట్నంలో జాబ్‌మేళా

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 7న నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో 15 కంపెనీలతో మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు సంస్థ జిల్లా అధికారి డాక్టర్ ఎన్.గోవిందరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో పదో తరగతి నుంచి పీజీ వరకూ విద్యార్హతల గల, 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు పేర్కొన్నారు. జాబ్‌మేళాలో పాల్గొనే నిరుద్యోగులు www.naipunyam.ap.gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9494791935, 9014765287 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

జూ ఆదాయం రూ 3.47 లక్షలు



వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద సందర్శకులు

ఆరిలోవ(విశాఖ): జూ పార్కులో ఆదివారం కార్తీక మాసం సందడి నెలకొంది. పిల్లలు, పెద్దలు వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద సరదాగా గడిపారు. యువకులు బ్యాటరీ వాహనాలు, సైకిళ్లపై సందడి చేశారు. జూను ఆదివారం సందర్శించిన 3,988 మంది ద్వారా రూ.3,46,744 ఆదాయం వచ్చినట్లు ఇన్‌చార్జి క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. ఈ నెల 5న నాగులచవితి సందర్భంగా జూ పార్కు ఉదయం 7.30 గంటలకే తెరుస్తామన్నారు. పూజల కోసం వచ్చే భక్తులు ఎటువంటి బాణసంచా తీసుకురావద్దని సూచించారు.

మైదానం.. అధ్వానం

- జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో నిండిపోయిన చెత్త
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన వ్యాపారులు
- విద్యార్థుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



పాడేరు జూనియర్ కళాశాల మైదానంలో నిండుకున్న దుకాణాల చెత్త

సాక్షి,పాడేరు: ఇటీవల దీపావళి బాణసంచాను రూ.లక్షల్లో అమ్ముకున్న వ్యాపారులంతా చెత్తను మాత్రం మైదానంలోనే వదిలేశారు. దీపావళి పండగ జరిగి నాలుగు రోజులు కావస్తున్నా పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరుకుపోయిన చెత్తను మాత్రం ఒక్క వ్యాపారి తొలగించకపోగా, పంచాయతీ పాలకవర్గం కూడా పట్టించుకోలేదు. పాడేరు జూనియర్ కళాశాల మైదానంలో దీపావళి బాణసంచా అమ్మకానికి 17 దుకాణాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే తమ కళాశాల మైదానంలో ఈ సామగ్రి అమ్మి మైదానంను పాడు చేయవద్దంటూ ప్రిన్సిపాల్‌తో పాటు విద్యార్థులంతా కలెక్టర్‌కు విన్నవించుకున్న ఫలితం లేకపోయింది. వ్యాపారులు టెంట్లు వేసుకుని 17 దుకాణాల ద్వారా అమ్మకాలు చేశారు. సుమారు రూ.60లక్షల పైబడి వ్యాపారం జరిగినట్టు అంచనా. పోటాపోటీగా భారీగానే అమ్మకాలు జరిపారు. అయితే మరుసటి రోజు ఈ చెత్తను వ్యాపారులు తొలగించాల్సిన బాధ్యత ఉంది. అయితే ఇంతవరకు ఆ వ్యాపారులు మైదానం వైపు రావడం మానేశారు. ప్రస్తుతం మైదానం నిండా చెత్త పేరుకుపోవడంతో విద్యార్థులు ఆటలకు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో వాకింగ్ చేసే వారికి ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి మైదానంలో చెత్తను తొలగించాలని విద్యార్థులతో పాటు స్థానికులు కోరుతున్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి



వలసగెడ్డ బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి

సీలేరు: అల్లూరి జిల్లాలో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు రహదారులు-భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సీలేరులోని పలు ప్రాంతాల్లో ఆయన ఆదివారం పర్యటించారు. గత సెప్టెంబరు 8న జరిగిన తుపాను ప్రభావంతో ఆర్.వి.నగర్ నుంచి పాలగెడ్డ వరకు ఉన్న రహదారులు, వంతెనలను పరిశీలించారు. జిల్లాలో రహదారుల అభివృద్ధికి రూ.43 కోట్లు నిధులు మంజూరైనట్టు చెప్పారు. ఇందులో భాగంగా రూ.33 కోట్లతో గూడెం కొత్తవీధి మండలం ఆర్.వి.నగర్ నుంచి పాలగెడ్డ వరకు రహదారి మరమ్మతు పనులు చేపడతామన్నారు. మరో రూ.10 కోట్లుతో రంపచోడవరం పరిధిలో ఉన్న రహదారి పనులు చేస్తామన్నారు. ఇందులో భాగంగా నవంబర్‌లో టెండర్లు ఆహ్వానించి డిసెంబరు నుంచి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అంతర రాష్ట్ర రహదారి విస్తరణకు అటవీశాఖ అభ్యంతరాలు రావడంతో పనులు నిలిచిపోయాయన్నారు. ఆర్.వి.నగర్ నుంచి పాలగెడ్డ వరకు ఉన్న రహదారి పూర్తిగా గోతులుండడంతో పూడ్చే పనులను డిసెంబరు నాటికి పూర్తి చేస్తామన్నారు. సంక్రాంతికి నాటికి రహదారి పనులు పూర్తి చేసే విధంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి జిల్లాలో రహదారి మరమ్మతు పనుల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను ప్రభుత్వం నియమించిందన్నారు. ఆయన వెంట ఆర్‌ఎండ్‌బీ ఈఈ బాల సుందరబాబు, డీఈ అప్పారావు, ఏఈ భరతుడు తదితరులున్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- సముద్రంలో మునిగి బీటెక్ విద్యార్థి మృతి
- బోటు సహాయంతో రక్షించిన మత్స్యకారులు, స్నేహితులు
- అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన అభిరామ్
- మృతుడు పెందుర్తి మండలం నాయుడు తోట వాసిగా గుర్తింపు



సముద్రంలో నుంచి అభిరామ్‌ను రక్షించి సహాయక చర్యలు చేపడుతున్న స్నేహితులు, మత్స్యకారులు



మృతి చెందిన అభిరామ్

రాంబిల్లి(యలమంచిలి): ఈత సరదా ఓ బీటెక్ విద్యార్థి ప్రాణం తీసింది. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో సరదాగా సముద్ర స్నానానికి వెళ్లిన యువకుడు కెరటాలకు కొట్టుకుపోయి అందని తీరాలకు వెళ్లిపోయాడు. రాంబిల్లి సీఐ నర్సింగరావు, మృతుడు తండ్రి జగన్నాథరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి మండలం, నాయుడుతోట గ్రామానికి చెందిన శ్రీగుడి వెంకటసాయి అభిరామ్(21) ఆదివారం తెల్లవారుజామున నలుగురు స్నేహితులతో కలసి ద్విచక్ర వాహనాలపై రాంబిల్లి మండలం సీతపాలెం సముద్రం తీరానికి వెళ్లారు. ఉదయం 6 గంటలకు సముద్రంలో సరదాగా స్నానానికి దిగి ఈత కొడుతూ ఉల్లాసంగా గుడిపారు. ఉదయం 7.30 గంటల సమయంలో కొంత ఆలసటకు గురైన అభిరామ్ సముద్రంలో ఉన్న రాయి మీదకు ఎక్కి సేదతీరుతున్నాడు. ఇంతలో అకస్మాత్తుగా ఒక పెద్ద కెరటం వెనక నుంచి వచ్చి ఢీకొట్టడంతో సముద్రంలో పడిపోయాడు. అలల తాకిడికి లోపలికి కొట్టుకుపోతుండగా గమనించిన ముగ్గురు స్నేహితులు స్థానిక మత్స్యకారులకు సమాచారం అందించారు. వారు బోటు సహాయంతో అపస్మారక స్థితిలో ఉన్న అభిరామ్‌ను రక్షించారు. కొన ఊపిరితో ఉన్న అభిరామ్‌ను స్నేహితులు తమ ద్విచక్ర వాహనాల మీద అచ్యుతాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ అభిరామ్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి తల్లిదండ్రులు, బంధువులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. అభిరామ్ ఇటీవల బీటెక్ పూర్తి చేసి ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగానికి ఎంపికయ్యాడని, కొద్ది రోజుల్లో విధుల్లో చేరాల్సి ఉందని రోదించారు. ఒక్కగానొక్క కుమారుడు ఇలా సముద్రంలో అలల తాకిడికి కొట్టుకుపోయి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు విషాదంలో మునిగిపోయారు. జగన్నాథరావు ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తూ కుమారుడు అభిరామ్‌ను అల్లారు ముద్దుగా పెంచి బీటెక్ వరకు చదివించారు. అంది వచ్చిన ఏకైక కుమారుడు ఆకస్మికంగా మృతి చెందడంతో ఆస్పత్రిలో ఆవరణలో ఆయన కన్నీరుమున్నీరుగా విలపించడం చూపరులను కలచివేసింది. జగన్నాథరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రాంబిల్లి సీఐ సీహెచ్.నర్సింగరావు తెలిపారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది(విశాఖ): సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజా కార్యక్రమంలో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణి స్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు.

కొనసాగుతున్న కార్తీ దామోదర మాసోత్సవాలు

కార్తీక దామోదర మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా వేకువ జామున 4.30 గంటల నుంచి 6 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు, మంగళహారతి, నరసింహ హారతి, తులసి హారతి, భగవంతునికి నేతి దీప సమర్పణ, గజేంద్ర స్తుతి, దామోదరాష్టకం, గోపి గీత, భగవద్గీత, శిక్షాష్టకం, యుగలాష్టకం పారాయణం నిర్వహించినట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ తెలిపారు.

గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి

నర్సీపట్నం డీఎస్పీ మోహన్



మాట్లాడుతున్న నర్సీపట్నం డీఎస్పీ మోహన్

నాతవరం: డివిజన్‌లో గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపినట్టు నర్సీపట్నం డీఎస్పీ జి.ఆర్.ఆర్. మోహన్ తెలిపారు. నాతవరం పోలీసు స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, ప్రధాన సమస్యలను ఎస్‌ఐ సీహెచ్.భీమరాజును అడిగి తెలుసుకున్నారు.స్టేషన్ పరిసరాలను క్షుణంగా పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గంజాయి రవాణాను నిరోధించేందుకు కృష్ణదేవి పేట, భీమవరం, చీడిగుమ్మల ఎర్రవరంలలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఆ చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశామన్నారు. సెప్టెంబరు 14 నుంచి అక్టోబరు 31వ తేదీలోపు పలు గంజాయి కేసుల్లో తప్పించుకుని తిరుగుతున్న 24 మందిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో దాక్కున్న వారిని సైతం పట్టుకున్నట్టు చెప్పారు. గంజాయి రవాణా చేసే వారిపైనే కాకుండా ప్రోత్సహించే వారిపై కూడా కేసులు పెడతామన్నారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించామని, ఇటీవల ఆన్‌లైన్ మోసాలకు చాలా మంది బలైపోతున్నారని తెలిపారు. అవగాహన సదస్సులు ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నట్టు చెప్పారు.ఈవ్‌టీజింగ్‌ను నిరోధించేందుకు కాలేజీల సమీపంలో, ఆర్టీసీ బస్టాండుల్లో పోలీసుల గస్తీ ముమ్మరం చేశామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తున్నట్టు చెప్పారు.

'మిషన్‌లైఫ్'తో నాణ్యమైన విద్యుత్ సరఫరా

మిషన్‌లైఫ్ అమలుకు మద్దతు ప్రకటించిన ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్



లైఫ్ మిషన్ పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

సాక్షి, విశాఖపట్నం: మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని అమలు చేస్తూ నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు కృషి చేస్తున్నామని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. బీఈఈ దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి రూపొందించిన 'మిషన్ లైఫ్' పోస్టర్‌ను కేంద్ర విద్యుత్తు సంస్థ (సీఈఏ) సభ్యుడు ప్రవీణ్ గుప్తా, బీఈఈ సెక్రటరీ మిలింద్ దేవరాతో కలిసి సీఎండీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పృథ్వీతేజ్ మాట్లాడుతూ మిషన్‌లైఫ్ అమలుకు బహిరంగ మద్దతు ప్రకటించిన తొలి డిస్కంగా ఈపీడీసీఎల్ నిలవడం ఆనందంగా ఉందన్నారు. వ్యర్థాల తగ్గింపు, నీరు, ఇంధన సంరక్షణ, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బీఈఈ సర్టిఫైడ్ ఇంధన సామర్థ్య ఉపకరణాల వినియోగాన్ని ప్రోత్సహించడం తదితర చర్యలపై దృష్టిసారించినట్లు వెల్లడించారు. బీఈఈ, ఏపీఎస్ఈసీఎంతో కలిసి ఈపీడీసీఎల్ పరిధిలో సమగ్ర కమ్యూనికేషన్ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మిషన్ లైఫ్ అమలుతో ఈపీడీసీఎల్ పరిధిలో ఆర్థిక వృద్ధితో పాటు వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. బీఈఈ సెక్రటరీ మిలింద్ దేవరా మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వంతో కలిసి బీఈఈ.. మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని తిరుపతిలో అమలు చేసి, దేశవ్యాప్తంగా సుస్థిర విధానాలకు నమూనాగా నిలిపేందుకు సిద్ధమవుతున్నామని తెలిపారు. జనవరి 2024 నాటికి ఎస్అండ్ఎల్ కార్యక్రమం పరిధిలోకి 35 ఇంధన సామర్థ్య ఉపకరణాలు వచ్చాయని, దీంతో రూ.54,324 కోట్ల విలువైన 81.64 బిలియన్ యూనిట్ల విద్యుత్తు పొదుపు చేసినట్లు తెలిపారు. డిస్కంలు తమ దీర్ఘకాలిక కమ్యూనికేషన్ వ్యూహాల్లో మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. సీఈఏ సభ్యుడు ప్రవీణ్ గుప్తా మాట్లాడుతూ రెన్యూవబుల్ పర్చేజ్ ఆబ్లిగేషన్(ఆర్పీవో)పై ప్రాంతీయ వర్క్ షాప్ నిర్వహించిన ఏపీని ప్రశంసించారు. పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడంలో ఆర్పీవో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ డైరెక్టర్లు, సీజీఎంలు పాల్గొన్నారు.

పంచారామాలకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు



పంచారామ దర్శనికి ఆర్టీసీ బస్సులో పయనమైన భక్తులు

డాబాగార్డెన్స్(విశాఖ): కార్తీక మాసంలో ఒక్క రోజులో పంచారామాలు దర్శనం చేసేందుకు ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభించింది. ద్వారకాబస్‌స్టేషన్ నుంచి ఆదివారం సాయంత్రం ఆర్టీసీ బస్సు బయలుదేరింది. పంచారామాలను దర్శించుకునే భక్తుల కోసం ఆదివారాల్లో ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు తెలిపారు. సూపర్ లగ్జరీ ప్రయాణ చార్జీ రూ.2,150, అల్ట్రా డీలక్స్ ప్రయాణ చార్జీ రూ.2,100గా నిర్ణయించామన్నారు. పంచారామాలను దర్శించుకునే భక్తులు www.apsrtconline.in ద్వారా ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చు. రిజర్వేషన్ కౌంటర్ వద్ద కూడా టికెట్లు బుక్ చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు 99592 25602, 90522 27083లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఏడు పదుల వయస్సు.. మూడు పతకాలు


- మాస్టర్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన చినకన్నబాబు



జిల్లా స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన ఆదిరెడ్డి చినకన్నబాబు

దేవరాపల్లి: మండలంలోని కాశీపురం గ్రామానికి చెందిన ఆదిరెడ్డి చిన కన్నబాబు మాస్టర్ అథ్లెటిక్స్ పో టీల్లో సత్తా చాటారు. విశాఖపట్నంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో కన్న బాబు 70 సంవత్సరాల వయసు పైబడిన విభాగంలో ఐదు కిలోమీటర్ల వాకింగ్, షాట్ పుట్‌లలో ప్రథమ స్థానాల్లో నిలిచి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. 100 మీటర్ల రన్నింగ్‌లో సిల్వర్ మెడల్‌ను సొంతం చేసుకున్నారు. జిల్లా స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో విశేష ప్రతిభ కనబరిచి రెండు బంగారు పతకాలు, ఒక సిల్వర్ మెడల్ అందకున్న కన్నబాబును మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికార్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభినందించారు.

కొబ్బరి చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన నాగేశ్వరరావు

అచ్యుతాపురం: మండలంలోని ఎం.జగన్నాథపురానికి చెందిన రైతు కరణం నాగేశ్వరరావు(46) ఆదివారం మధ్యాహ్నం కొబ్బరి చెట్టు పైనుంచి జారి పడి మృతి చెందారు. స్థానిక సీఐ నమ్మి గణేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కరణం అప్పలనాయుడు కుమారుడు నాగేశ్వరరావు తన సొంత పొలంలోని కొబ్బరి చెట్టు ఎక్కగా కాలు జారడంతో కింద పడిపోయారు. చేయి విరిగిపోవడంతో పాటు, తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

50 మద్యం బాటిళ్ల స్వాధీనం

అనకాపల్లి: మండలంలో తుమ్మపాల పంచాయతీ పరిధిలో ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తగరంపూడి గ్రామానికి చెందిన సంమంగి నాగరాజు నుంచి 50 మద్యం క్వార్టర్ బాటిళ్లతో స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఎస్‌ఐ ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు నాగరాజుపై కేసు నమోదు చేశామన్నారు.

7న వీవోఏల ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న రూపాదేవి

అనకాపల్లి: వెలుగు వీవోఏలుగా పనిచేస్తున్న యానిమేటర్లను ప్రతి మూడు సంవత్సరాలకు రెన్యువల్ చేయాలన్న సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలని, బకాయిపడిన ఐదునెలల వేతనాన్ని చెల్లించాలన్న డిమాండ్‌తో ఈనెల 7న జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కార్యాలయాల వద్ద ఆందోళన చేయనున్నట్టు ఏపీ వెలుగు వీవోఏ(యానిమేటర్స్)ల సంఘం(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి సీహెచ్. రూపాదేవి తెలిపారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో సంఘం గౌరవాధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ఆదిలోనే వీవోఏలపై కత్తి కట్టిందన్నారు. మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు విస్మరించిందని తెలిపారు. ఐదు నెలలకు ఒకసారి కార్మికులకు ఒక నెల జీతం మాత్రమే ఇస్తున్నారని, ప్రతి నెలా జీతాలు చెల్లించాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత, ఇన్సూరెన్స్ తదితర సదుపాయాలు కల్పించాలని ఆమె కోరారు. డిమాండ్ల సాధనకు ఈనెల 11, 12 తేదీల్లో నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్టు చెప్పారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కలెక్టర్ కార్యాలయాలు వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు ఎం.రాజేష్, రాము, లక్ష్మి, కె.ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతరకు పోదాం.. చలో చలో

- వైభవంగా యలమంచిలి పంచరాత్రి ఉత్సవాలు
- 80 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం
- భారీ విద్యుద్దీపాల సెట్టింగ్‌లతో కాంతులీనుతున్న పట్టణం



పాతవీధిలో సుబ్రహ్మణ్యస్వామి సెట్



విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న దిమిలిరోడ్డు

యలమంచిలి రూరల్: పంచరాత్రి ఉత్సవాలతో యలమంచిలి పట్టణం కాంతులీనుతోంది. పిల్లలు, పెద్దలు, యువతీ, యువకులు ఉత్సవాలను తిలకించడానికి పెద్ద సంఖ్యలో రావడంతో పట్టణంలో కోలాహల వాతావరణం నెలకొంది. పట్టణంలో ప్రతి ఏటా దీపావళి నుంచి నాగుల చవితి వరకూ భూలోకమాంబ, సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవాలు నిర్వహించడం 80 ఏళ్ల నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఆలయాల సందర్శనతో పాటు యలమంచిలి పంచరాత్రి ఉత్సవాల్లో ఏర్పాటు చేసే భారీ సెట్టింగులు, లైటింగ్‌ను చూసేందుకు పక్క జిల్లాల నుంచి భక్తులు, యాత్రికులు తరలి వస్తున్నారు. యలమంచిలి ప్రధాన రహదారి, తులసీనగర్, దిమిలి రోడ్డు జంక్షన్, పాతవీధి రోడ్డు, సతకంపట్టు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భారీ సెట్టింగులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. విద్యుద్దీపాలతో రూపొందించిన శ్రీవారి ఆలయం సెట్టింగ్, సుబ్రహ్మణ్యస్వామి కటౌట్, శ్రీరామ పట్టాభిషేక ఘట్టం, దశావతారాలతో విష్ణుమూర్తి రూపం, వినాయకుడు, పరమ శివుడు, దుర్గాదేవి సహా అనేక దేవతామూర్తుల రూపాలతో ఏర్పాటు చేసిన సెట్టింగ్‌లు చూపరులను కట్టిపడేస్తున్నాయి. వీధుల్లో అంతర్గత రహదారులకు ఇరువైపులా కళ్లు మిరుమిట్లుగొలిపేలా వివిధ ఆకతుల్లో నెలకొల్పిన విద్యుద్దీపాలంకరణలు అబ్బురపరుస్తున్నాయి. చివరి రోజైన మంగళవారం నాగుల చవితి రోజు జరిగే జాతరకు లక్షలాది మంది భక్తులు వస్తారని నిర్వాహకులు భావిస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పట్టణ పోలీసులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

పిల్లలకు ఆట విడుపు

యలమంచిలి పంచరాత్రి ఉత్సవాలు పిల్లలకు ఆట విడుపుగా నిలిచాయి. ఆట వస్తువులతో పాటు, జెయింట్ వీల్, రంగుల రాట్నం, స్ప్రింగ్ మిషన్, గన్‌షూట్, డ్రాగన్ ట్రైన్, గుర్రపు స్వారీ.. ఇలా రకరకాల సరదా ఆటలతో ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. మరో వైపు తులసీనగర్ భూలోకమాంబ అమ్మవారు, పాతవీధి సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిత్యం చేస్తున్నారు. ఆలయాల వద్ద రోజూ సాయంత్రం ప్రదర్శిస్తున్న విద్యార్థినుల కూచిపూడి, సంప్రదాయ నృత్యాలు అలరిస్తున్నాయి. అలాగే పట్టణంతో పాటు ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన చిరు వ్యాపారులు ఈ ఉత్సవాల్లో బొమ్మలు, అలంకరణ వస్తువులు, ఆట వస్తువులు, ఆకర్షణీయమైన గృహోపకరణ వస్తువులు, రకరకాల బెలూన్లు, ఫాస్ట్ ఫుడ్స్, పచ్చబొట్లు వేయడం .. ఇలా అనేక రకాల స్టాళ్లను ఏర్పాటు చేశారు.



జాతరలో పాఠశాల బాలికల సంప్రదాయ నృత్య ప్రదర్శన